మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# భూ అక్రమణలు తొలగించాలి

**అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి .. కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం, సర్వే నెంబర్ 247,250లో క్షేత్రసాయిలో పరిశీలన**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 7 ప్రభాతవార్త:** ప్రభుత్వం కేటాయించిన భూమి ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లాకలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, వివిధ శాఖల అధికారులతో కలిసి మహబూబ్‌నగర్‌జిల్లాకేంద్రంలో లక్ష్మి నగర్‌లో సర్వేనెంబర్ 247,250లలో ఎస్‌సి కార్పొరేషన్‌కు కేటాయించిన 5ఎకరాల30గుంటల భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎస్‌సి కార్పొరేషన్ నుండి హాస్టల్ నిర్మాణంకు ఎస్‌సి అభివృద్ధి శాఖకు భూమిని అప్పగించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో విజిలెన్స్ మానిటరింగ్ పిఓఎ చట్టం సమావేశంలో కమిటీ సభ్యులు ఎస్‌సి కార్పొరేషన్‌కు కేటాయించిన భూమిఆక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగించి భూరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రస్తావించారు.కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్‌డిఓ నవీన్, అర్బన్ తహశీల్దార్ ఘన్సీరాం, ఎస్‌సి కార్పొరేషన్ ఇంచార్జి ఈడి వెంకట రెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి సునీత, మున్సిపల్, సర్వే లాండ్ రికార్డ్, రెవెన్యూ సిబ్బందితో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వే లాండ్ రికార్డ్ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని, భూమి రక్షణకు సంబంధిత షెడ్యూల్డ్ కులాల శాఖ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ఆక్రమణలపై పరిశీలించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## సమన్వయంతో పనిచేయకపోతే
# చర్యలు తప్పవు

జిల్లాలో ఇంటర్నెట్ కనెక్షన్ లేని
పాఠశాలలకు వెంటనే ఇంటర్నెట్ కనెక్టివిటీ చేయాలి
మధ్యాహ్న భోజనానికి గ్యాస్ సిలిండర్ ద్వారానే వంట చేయాలి

**వనపర్తి, నవంబరు 7 ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వర్తించే పై స్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు సమన్వయంతో పనిచేయకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో పీఎం పోషణ్, పీఎం శ్రీ పథకాల అమలు, సహా పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావిద్యాశాఖ పరిధిలోని అన్ని పాఠశాలల్లో ప్రభుత్వ -మిగతా4లో..



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

## మోడల్ హాస్టల్‌గా
# మారుస్తాం..

- ఆధునిక లైబ్రరీ అత్యుత్తమ పుస్తకాలు అందుబాటులోకి తెస్తాం
- వెంటనే నివేదికలు తయారు చేయండి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదేశం
- కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాల తనిఖీ

4

# ఏం జరుగుతోంది..?

## జడ్చర్ల మున్సిపాలిటీపై సర్వత్రా చర్చ

- రెండు రోజుల కిందట బిఆర్ఎస్ కౌన్సిలర్ల వాకౌట్..
- మట్టి పోయకుండానే నిధులు మింగారంటూ ఆరోపణ..
- సమస్యలు పట్టవా అంటూ నిలదీత
- మున్సిపల్ కార్యాలయ ప్రహరీకి రీ టెండర్..?
- రంగంలోకి ఎమ్మెల్యే ?





జడ్చర్ల మున్సిపల్ కార్యాలయం

**జడ్చర్ల , నవంబర్ 7, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలో ఏం జరుగుతోంది.. ఏ పనులు ఎవరు చేస్తున్నారు.. అసలు విషయం మున్సిపల్ చైర్ పర్సన్ ఉన్నట్లా లేనట్లా.. కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఉండదు.. చేయాల్సిన పనులకు ప్రతిపాదనలు పెట్టరు.. చేసిన పనులకే మళ్లీ పనులు చేపట్టినట్లు బిల్లులు చేస్తారు..జడ్చర్ల మున్సిపాలిటీని నడిపిస్తున్నది ఎవరు.. అంటూ పట్టణంలోనూ చర్చనీయాంశం అయింది. మట్టి పనుల్లో.. మతలబు...మున్సిపాలిటీలో కొన్ని వార్డుల్లో రహదారులు గుంతల మయంగా మారడంతో తాత్కాలిక మరమ్మత్తుల కింద మున్సిపాలిటీ నిధుల నుంచి మట్టిని పూడ్చి రోడ్డును చదును చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా చాలా వార్డులో పనులు చేసినట్లు బిల్లులు చేయడం, కేవలం కొన్ని వార్డుల్లో మాత్రమే పనులు చేపట్టడం వెనుక మతలబు ఏంటి అని కౌన్సిలర్లు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవలే 13వ వార్డులో సీసీ రోడ్డు పనులు చేయొద్దని, అప్పటికే ఉన్న రోడ్డు మీద మళ్లీ రోడ్డు వేయడం ఏంటని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఇదంతా చర్చనీయాంశం కావడంతో ఆ రోజు పనులు ఆపేశారు. అయితే మరుసటి రోజు తెల్లారేసరికి రోడ్డుపైనే మళ్లీ రోడ్డు వేయడం కాలనీవాసులనే కాదు కౌన్సిలర్లను కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదే విషయమై బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్‌ను, కమిషనర్ను ప్రశ్నించారు. అయితే ఈ విషయం తమ పరిధిలో లేదని అంతా పైవాలు చేశారంటూ దాటవేయడం గమనార్హం. మున్సిపాలిటీ కార్యాలయ ప్రహరీ నిర్మాణానికి రీటెండర్ పిలవడం వెనక కారణం ఏంటని చర్చించుకుంటున్నారు. మున్సిపాలిటీలో జరిగే పనులకు సంబంధించి కమిషనర్ కు చైర్పర్సన్ కు సమాచారం లేకుండా పనులు ఎవరు చేస్తారు ఎవరు చేయిస్తారు అని అంతా మొక్కన వేలేసుకుంటున్నారు. అయితే ఆ పైవాళ్లు ఎవరు చెప్పాలని మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు నిలదీసి వాక్ అవుట్ చేసిన సంగతి తెలిసిందే.

### కొన్ని వర్గాల సిండికేట్ ?!

జడ్చర్ల మున్సిపల్ లోని కొన్ని వర్గాలు, కౌన్సిలర్లు సిండికేట్ గా మారి తమ పనులను చక్క దిద్దుకుంటున్నట్లు సమాచారం. అయితే బిఆర్ఎస్

### గుంతలమయంగా రోడ్డు



కాలనీ రోడ్లు చాలా అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కనీసం రోడ్ల వెంట వాహనాలు నడిపే పరిస్థితి లేకుండా పోయింది. సిగ్నల్ గడ్డ నుంచి పాత బజారు వెళ్లే ప్రధాన రహదారి అంతా గుంతలమయం. రోడ్డు మరమ్మత్తులను వెంటనే చేయాలి. మున్సిపల్ పాలకవర్గం అన్ని వార్డుల్లో పనులు చేపట్టాలి. ప్రధానంగా రోడ్ల మరమ్మతు, డ్రైనేజీ ఇబ్బందులను తొలగించాలి.

*- కోట్ల ప్రశాంత్ రెడ్డి, 24వ వార్డు కౌన్సిలర్, జడ్చర్ల మున్సిపాలిటీ*

కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కూడా సిండికేట్ అయ్యి కొన్ని మున్సిపల్ వ్యవహారాల్లో మేమంతా ఒక్కటే అనే రీతిలో సంకేతాలు పంపుతున్నట్లు తెలిసింది. జడ్చర్ల మున్సిపాలిటీలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఎక్కడ చూసినా ఇండ్ల మధ్యలో డ్రైనేజీ మురుగు, గుంతల మయమైన రోడ్ల దర్శనమిస్తున్నాయి. కొన్ని వార్డులోనే పనులు జరుగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దగ్గర పడుతున్న ప్రధాన రహదారి పనుల్లో వేగవంతం లేకపోవడం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చెప్పుతున్న మాటలకు జరుగుతున్న పనులకు పొంతనలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జడ్చర్ల 83పడకల దవాఖాన 30 పడకల దవాఖానగా మారడం, అన్ని రకాల వైద్యులు కూడా అందుబాటులో లేకపోవడం తో జనాలు నిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు తప్ప.. సమస్యలపై ఒక్కరోజు కూడా కాలనీలో పర్యటించింది లేదని ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు సమస్యలపై నిలదీసి మున్సిపల్ పాలకవర్గం పోకడలపై -మిగతా4లో..



ఇండ్ల మధ్యలో డ్రైనేజీ మురుగు నీరు

# చిత్తడి నేలల సంరక్షణ కీలకం

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- కలెక్టరేట్‌లో జిల్లా వెట్ ల్యాండ్ కమిటీ సమావేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో నవంబరు7,ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెరుగుదల దృష్ట్యా చిత్తడి నేలల సంరక్షణ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశమందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లావెట్ ల్యాండ్‌కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

చిత్తడి నేలల గుర్తింపు, భౌగోళిక సరిహద్దుల నిర్ణయం, వాటి పరిరక్షణ, అభివృద్ధి, మరియు సుప్రీం కోర్టు ఆదేశాల అమలుకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా చిత్తడినేలల భౌగోళిక గుర్తింపుప్రక్రియ వేగవంతం చేయడం అత్యవసరం. ఇందుకోసం అటవీశాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్,సర్వే విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోపు గుర్తింపు ప్రక్రియను పూర్తిచేయాలి అని తెలిపారు.జిల్లాలో చెరువులను ఎంపిక చేసి, వాటిపై సమగ్ర సర్వే నిర్వహించాలి. వాటి భౌగోళిక సరి హద్దులను ఖచ్చితంగా నిర్ణయించి, క్షేత్ర ధృవీకరణ చెయ్యాలని ఆదేశించారు గుర్తించిన చిత్తడి నేలల పరిధిలో ఎటువంటి నిర్మాణాలు, మానవ జోక్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.చిత్తడి నేలలు పర్యావరణ సమతుల్యతకు కీలకమైన జీవ వ్యవస్థలు. ఇవి వర్షపు నీటిని నిల్వ -మిగతా4లో..

## ఆటోను ఢీకొన్న ట్యాంకర్ ...
# ఇద్దరు యువకులు మృతి

**వడ్డేపల్లి, నవంబరు 7 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జులకల్ వాగులో ఆటోను ట్యాంకర్ ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు యువకులు స్పాట్‌లోనే మృతి చెందారు. రాజోలి మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన ఆటో మహేష్ (20), విశ్వాస్ (19) శాంతినగర్ కూరగాయల మార్కెట్ నుంచి ఆటోలో టమాట బాక్సులు వేసుకొని పచ్చర్లకు వెళుతుండగా జులకల్ వాగులో ఆటోను అతివేగంతో లారీ (ట్యాంకర్) ఢీ కొట్టింది. దీంతో మృతుల గ్రామం పచ్చర్లలో విషాదఛాయలు అలుముకున్నాయి తల్లిదండ్రుల రోదన ప్రతి ఒక్కరిని కలిసివేసింది. ఆటోను ఢీ కొట్టిన (ట్యాంకర్) లారీని పోలీసులు పట్టుకున్నారు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగ శేఖర్ రెడ్డి తెలిపారు.

# వందేమాతరం“ సామూహిక గీతాలాపన



సామూహిక గీతాలాపనలో కలెక్టర్, సిబ్బంది, అధికారులు

**మహబూబ్‌నగర్, నవంబరు 7 ప్రభాతవార్త:** వందే మాతరం” జాతీయ గీతాన్ని మహాకవి బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. కలెక్టర్ విజయేందిర బోయి ఆధ్వర్యంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అందరూ స్వచ్ఛందంగా పాల్గొని దేశభక్తి భావాన్ని చాటారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. సామూహిక గీతాలాపనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ సువర్ణ రాజ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పేట కలెక్టరేట్‌లో...

**నారాయణ పేట, నవంబరు 7 ప్రభాతవార్త** : నారాయణపేట జిల్లా కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం ఘనంగా వందేమాతరం సామూహిక గీతాలాపన జరిగింది. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు. వందేమాతర గీతం భారతీయులందరికీ గర్వకారణమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఈ గీతం స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించి కోట్లాది ప్రజల్లో దేశభక్తిని నింపిందన్నారు. వందేమాతరం ఆలపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా గీతాలాపన కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. భారతీయుల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ గీతం గొప్పదనాన్ని నేటితరానికి తెలియజేయడం ఎంతో అవసరమన్నారు. దేశ చరిత్రలో వందేమాతరం గీతానికి ఉన్న ప్రాధాన్యతను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు విద్యాసంస్థల్లో సామూహిక గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్



వందేమాతరం గీతాపాలనలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు

కార్యక్రమంలో ఆర్డీఓ రామచంద్రనాయక్, ఏవో శ్రీధర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమానికి ఊపిరి పోసిన వందేమాతర గీతం

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, నవంబరు 7 ప్రభాతవార్త :** భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసిన వందేమాతర గీతాన్ని 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సమైక్యంగా ఆలపించడం ఎంతో గర్వకారణంగా ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బంకిం చంద్ర ఛటర్జీ వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా అధికారులు, ఐడిఓసి సిబ్బందితో కలిసి సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఉద్యమకారులకు వందేమాతర గీతం ఒక స్ఫూర్తిని ఇచ్చిందని గుర్తు చేశారు. 150 సంవత్సరాలుగా మన సమిష్టి జీవనంలో అంతర్భాగంగా ఉన్న ఈ గీతం భావి తరానికి సైతం స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, జిల్లా అధికారులు, ఐడిఓసి సిబ్బంది గీతాలాపన చేశారు.



సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్

### వందేమాతరం గేయం జాతీయ సమైక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించింది....

**-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 7 ప్రభాతవార్త:** జాతీయ గుర్తింపు భావన, ఆంగ్లేయుల పాలనపై ప్రతిఘటన పెరుగుతున్న ఆ కాలంలో వందేమాతరం గీతం, మాతృభూమిని బలం, శ్రేయస్సు, దైవత్వానికి ప్రతీకగా మార్చిందని, జాతీయ సమైక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించి దేశభక్తికి శాశ్వత చిహ్నంగా మారిందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. 1875 నవంబర్ 7న బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయానికి 150 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఐడిఓసి ప్రధాన సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్యక్షతన అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం అన్ని శాఖల అధికారులు సిబ్బందితో కలిసి సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జాతీయ గీతం వందేమాతరానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికీ జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకలు 2025 నవంబర్ 7 నుంచి 2026 నవంబర్ 7 వరకు ఏడాది పొడవున దేశవ్యాప్తంగా జరగనున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు, భారతదేశ చరిత్రలో వందే మాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా చేపడుతున్న వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరిగిందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కళాశాల నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

## నర్సింగ్ కళాశాల పనులను
# త్వరితగతిన పూర్తి చేయాలి

**గద్వాలటౌన్ నవంబర్ 7, ప్రభాతవార్త:** గద్వాలలో రూ.30కోట్ల నిధుల అంచనాతో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల భవనంలోని మిగిలి వున్న పనులను నిర్ణీత గడువులోపు త్వరితగతిన పూర్తి చేసే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు.శుక్రవారం పట్టణ శివారులోని పరమాల గ్రామం వద్ద నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల, క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. భవనం ప్రారంభించుకున్నాక ఎలాంటి సమస్యలు లేకుండా అవసరమైన ఇతర పనులు ఏమైనా ఉంటే ఇప్పుడే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అంతర్గత రహదారులు, నీటి వసతి, ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.అనంతరం క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులను వివిధ బ్లాక్ లలో తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణ పనుల మ్యాపును పరిశీలించి తగు సూచనలు చేశారు. అలాగే నూతనంగా నిర్మించి ప్రారంభించిన జిల్లా ఆసుపత్రి భవనంలో నిర్వహిస్తున్న మెడికల్ కళాశాలలో వివిధ విభాగాలను పరిశీలించి విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. కళాశాల భవనం పై అంతస్థులో మెడికల్ కళాశాల బాలికలకు వసతి ఇబ్బందులు లేకుండా అవసరమైన పనులన్నీ పూర్తి చేయాలన్నారు. నర్సింగ్ కళాశాల భవనం ప్రారంభించుకున్నాక కలెక్టరేట్ వెనక వైపు పాత ఎస్పీ భవనంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాల భవనంలో మెడికల్ కళాశాల బాలురకు వసతి సౌకర్యం కల్పించేందుకు పరిశీలించాలని ఆదేశించారు. గద్వాలలో రూ. 130 కోట్ల నిధుల అంచనాతో నిర్మించనున్న మెడికల్ కళాశాలకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.ఈ పర్యటనలో మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, టీజీఎంఎస్ఐడిసి (తెలంగాణ గవర్నమెంట్ మెడికల్ సర్వీస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుగోపాల్, ఏఈ ఎండి రహీం, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఇందిర, మెడికల్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ నాగేశ్వర రావు, ఏ.డి.రమేష్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతమ్మ, ఏ. ఓ. శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించండి

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**




ప్రచారం నిర్వహిస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జులు

**దేవరకద్ర, నవంబ 7 ప్రభాతవార్త:** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా పవిత్ర శుక్రవారం పురస్కరించుకుని ఎర్రగడ్డ డివిజన్‌లోని మసీదుల వద్ద జూబ్లీహిల్స్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి హస్తం గుర్తుకు ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందని దీంతో ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సు కోసం విద్యార్థుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

**వనపర్తి, నవంబరు 7 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలంలోని కంబాల పురం గ్రామంలో శుక్రవారం విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలకు, కళాశాలకు వెళ్లేందుకు తమకు బస్సు సౌకర్యం కల్పించాలని ధర్నా చేయడం జరిగింది. శ్రీరంగాపురంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకోవడానికి కంబాలపురం నుంచి శ్రీరంగాపురానికి ప్రతి రోజు విద్యార్థిని, విద్యార్థులు వెళుతుంటారు. కానీ సాయంకాలం సమయంలో శ్రీరం గాపురం నుంచి కంబాలపురానికి బస్సు సౌకర్యం లేనందువల్ల ప్రతిరోజు విద్యార్థులు కాలినడకతో నాలుగు కిలోమీటర్లు నడిచి రావాల్సి వస్తుంది. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కో వాల్సి వస్తుంది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రతిరోజు పిల్లలు నడుచుకుంటూ రావడం వల్ల భయాందోళనలకు గురికావడం జరుగుతుంది. ఈవిషయాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ డిపో మేనేజర్ తమకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు కోరడం జరిగింది.

## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలు

**మహబూబ్‌నగర్, నవంబరు 7 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లాలోని దివ్యాంగులకు రాష్ట్ర స్థాయిలో జరుగబోయే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం 2025 సందర్భంగా రాష్ట్ర స్థాయిలో పురస్కారాలను అందుకొనుటకు అర్హులైన దివ్యాంగ వ్యక్తుల నుంచి, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కావున అర్హులైన వారు ఈ నెల 16 సాయంత్రం 5 గంటలలోపు మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, రూం నం.36, జిల్లా కలెక్టర్ కార్యాలయము, మహబూబ్ నగర్ నందు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు, దరఖాస్తు కొరకు అన్ లైన్ వెబ్ సైట్ హెచ్‌టిటిపిఎస్//డబ్ల్యుడిసి, తెలంగాణ. జిఓవి.ఇన్‌లో తెలుసుకోగలరని జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, మహబూబ్ నగర్ ఒక ప్రకటనలో తెలియజేసారు.

## జిల్లా స్థాయికి మంతన్‌గౌడ్ పాఠశాల విద్యార్థిని

**మక్తల్ టౌన్, నవంబరు 7 ప్రభాతవార్త:** టీ సాట్ నెట్వర్క్, తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన వివిధ రకాల మండల స్థాయి పాఠశాలల పోటీల్లో, జెడ్‌పిహెచ్‌ఎస్ మంథన్ గోడ్ పాఠశాల ప్రథమ బహుమతి సాధించి జిల్లా స్థాయిపోటీకి ఎంపికయింది. జడ్‌పిహెచ్‌ఎస్ బాలుర మక్తల్ లో జరిగిన ఈ పోటీలో భాగంగా మంతన్ గోడ్ పాఠశాలలోని తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని సి.అనూష ఉపన్యాస పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది.ఉపన్యాస పోటీకి సంబంధించిన అంశం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి పర్యావరణాన్ని కాపాడండి అనే శీర్షికన ఈ ఉపన్యాస పోటీలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన ఖాజా అమీరుద్దీన్ చేతుల మీదుగా విజేతగా నిలిచిన అనూషకు సర్టిఫికెట్ అందించారు. విద్యార్థినికి అభినందనలు తెలిపిన వారిలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేష్, సూర్యచంద్ర, సునంద, శ్రీనివాసరావు, లక్ష్మీ నరసింహ చారి, సునంద, అశోక్, గ్రామస్తుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా పర్యావరణ రహిత వస్తు ప్రదర్శన

**నారాయణ పేట, నవంబరు 7 ప్రభాతవార్త :** చిట్టెం నర్సి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పర్యావరణహిత వస్తు ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ సహకారంతో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సౌజన్యంతో కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులు పునర్వినియోగ వస్తువులు సహజ పదార్థాలతో తయారైన ఉత్పత్తులు ఆరోగ్యకరమైన తినుబండారాలు వంటి పర్యావరణహిత వస్తువులను స్టాళ్లలో ప్రదర్శించారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శనలో ఆసక్తిగా పాల్గొని ప్రతి ఉత్పత్తి యొక్క తయారీ విధానం వినియోగం గురించి అవగాహన పొందారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ అధికారి రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ డా. మెర్సి వసంత మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి పర్యావరణానికి మేలు చేసే ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు వ్యాపార దృష్టికోణం కూడా పెరుగుతుందని తెలిపారు. పర్యావరణ సంరక్షణ పట్ల సమాజంలో చైతన్యం పెంపొందించడమే ఈ ప్రదర్శన ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. షఫీక్ హైమద్, జి.శ్రీనివాస్, నిర్మల, సంగీతతో పాటు అధ్యాపకులు శ్రీనివాస్, ప్రభాకర్, కవిరాజ్, రామకృష్ణ, చిన్ని కిషోర్, సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. మెర్సివసంత

## నాణ్యమైన విత్తనాలతో పంట అధిక దిగుబడులు

**ఇటిక్యాల నవంబర్ 7, ప్రభాతవార్త;** నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకుని రైతులు పంటలలో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కళ్యాణి రైతులకు సూచించారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఎర్రవల్లి మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో రైతు శివన్న నాయుడు పొలంలో వరి ఆర్ఎన్ఆర్ 15048 పంటపై క్షేత్ర దినోత్సవం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కే. కళ్యాణి హాజరై పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనం రైతు విజయానికి మొదటి మెట్టు , విత్తన నాణ్యత ద్వారా పంట దిగుబడులు, ఆదాయం రెండు పెరుగుతాయని, అదేవిధంగా ఈ విత్తనాన్ని గ్రామంలోని ఇతర రైతులకు ఇవ్వడం వలన వారికి నాణ్యమైన విత్తనం చౌకగా లభిస్తుందని రైతులు ఎక్కడో దూరంగా వెళ్లి వేరే మార్కెట్లో తెలియని రకాలు కొనుగోలు చేయడంకంటే ఇక్కడ తమ గ్రామంలోని తమ రైతులే పండించిన నాణ్యమైన విత్తనం తీసుకోవడం వలన రైతులకు వ్యయ ప్రయాసాలు తగ్గి సులభంగా విత్తనం అందుబాటులోకి వస్తుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ గౌడ్, రైతులకు విత్తన నిల్వ విధానాలపై అవగాహన కల్పించారు. రైతులు తమ యొక్క అనుభవాలు పంచుకుంటూ వారు ఈ రకంగా నాణ్యమైన విత్తనం తమ గ్రామంలోనే దొరుకుతూ పదిమందికి అందుబాటులోకి రావడం వలన తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నరేష్,ఇతర రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్త. డాక్టర్ కళ్యాణి, అధికారులు

# ఘనంగా సామూహిక వందేమాతర గీతాలాపన

- స్వాతంత్ర్య స్ఫూర్తికి చిరస్మరణీయ ఘనత జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి
- సమష్టిగా వందే మాతరం ఆలాపన పోలీసు కుటుంబం దేశభక్తి ఏకతను చాటింది
- మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిన గీతానికి 150 సంవత్సరాల ఘన వందనం



సమిష్టిగా వందేమాతరం ఆలాపన చేస్తున్న పోలీసులు



ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ లో వందేమాతరం గీతాలాపన చేస్తున్న పోలీసులు

**వనపర్తి, నవంబరు 7 ప్రభాతవార్త:** దేశభక్తి, ఐక్యత, జాతీయ గౌరవానికి ప్రతీకగా నిలిచిన వందే మాతరం, జాతీయగీతం 150 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని, శుక్రవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో వందే మాతరం జాతీయ గీతం 150 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, అధికారులు, కార్యాలయ సిబ్బంది కలిసి సమిష్టిగా వందే మాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ మాట్లాడుతూ వందే మాతరం గీతం మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిందని, ఈ గీతం భారత మాత పట్ల ఉన్న భక్తి, త్యాగం, దేశాభిమానానికి ప్రతీక అని తెలిపారు. ఈ వేడుకలు ప్రతి భారతీయునిలో దేశభక్తిని, ఐక్యతను, జాతీయ గౌరవాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. జాతీయ గీతం పట్ల గౌరవభావాన్ని పెంపొందించాలని, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ ఉమామహేశ్వరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్. రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, డిసిఆర్బి ఎస్సై తిరుపతిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పునుంతలలో..**

**ఉప్పునుంతల, నవంబరు 7 ప్రభాతవార్త :** వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మండలంలో ఘనంగా 150వ వందేమాతరం వార్షికోత్సవం నిర్వహించుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా జాతీయ ఉద్యమ మహనీయులకు స్మరించుకుందామని జాతీయ గీతం స్ఫూర్తిగా సమైక్యతా భావంతో దేశాభివృద్ధికి మనమంతా పునరంకితమవుదామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పునుంతల ఎస్ఐ వెంకట్ రెడ్డి, ఎంపిడిఓ వరుణ్ తేజ్, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంఛార్జి ఎచ్ఎం నీలా శ్రీధర్, కంసానిపల్లి హైస్కూల్ హెచ్ ఎం, మేడిపూర్ పాఠశాల హెచ్ఎం, మేడిపూరి మల్లికార్జున్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**నవాబుపేటలో..**

**మహబూబ్‌నగర్ ,నవంబరు 7 ప్రభాతవార్త :** వందే మాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా నవాబుపేట మండల కార్యాలయంలో ఎంపీడీఓ, తహసిల్దార్, ఎన్ఆర్ఈజీఎస్ ఐకెపి సిబ్బంది వందేమాతరం పాడి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. వందే మాతరం చారిత్రక నేపథ్యం, దేశ భక్తిని ప్రేరేపించే అంశాలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా మండల అధికారులు, వందే మాతరం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ గీతం దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని, ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాం నాయక్, మండల ఆయా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**తాసిల్దార్ కార్యాలయంలో వందేమాతరం గేయాలాపన**

**వనపర్తి, నవంబరు 7 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో వందేమాతరంను రచించి 150 సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా కార్యాలయంలో సిబ్బంది అందరూ సామూహికంగా వందేమాతరం పాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల తహసిల్దార్ రాజు, ఆర్ఐ రాధాకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

**150వ ఆకారంలో స్వామి వివేకానంద విద్యార్థులు**

**భూత్పూర్, నవంబరు 7 ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని స్వామి వివేకానంద విద్యాలయంలో శుక్రవారం వందేమాతరం గేయం రూపొందించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు 150వ ఆకారంలో కూర్చుని, జాతీయ పతాకాలను చేబూని సామూహికంగా వందేమాతరం ఆలపించారు. ఈ సందర్భంగా వందేమాతరం గేయ రచయిత బంకింగ్ చంద్ర చటర్జీ జీవిత విశేషాలతో పాటు వందేమాతరం గేయ రచనకు దారి తీసిన అంశాలు, ఈ గేయము ప్రతి ఒక్కరిలో స్వాతంత్ర పోరాటంలో దేశభక్తి భావాలను పెంపొందించిన వివరాలు తదితరాలను గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిచంద్ర, శివకుమార్, సాహితి, శిరీష, శివరాణి, సింధు , చైతన్య తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీ మ్రపల్లిలో ఆకట్టుకున్న వందే మాతరం సామూహిక గీతాలాపన**

**దేవరకద్ర, నవంబరు 7 ప్రభాతవార్త:** మహాకవి బంకీం చంద్ర ఛటర్జీ వందేమాతరం జాతీయ గీతాన్ని రచించి 150 ఏళ్ళు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవరకద్ర మండలం లక్ష్మీ మ్రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సామూహిక వందే మాతరం గీతాలాపన అందరినీ ఆకట్టుకుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండాను చేతబూని వందేమాతరం ..అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో వందేమాతరం గీతానికి గల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల్లో మరింతగా దేశభక్తిని పెంచేందుకు వందే మాతరం సామూహిక గీతాలాపన ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్‌యంలు కెకె శ్రీనివాస్, ఎస్.కల్పన, ఉపాధ్యాయులు మురళీధర్, దోమ శంకర్, అశ్విని చంద్రశేఖర్, కావలి సుజాత తదితరులు పాల్గొన్నారు.

**మార్మోగిన వందేమాతర గీతం**

**భూత్పూర్, నవంబరు 7 ప్రభాతవార్త :** భారత స్వతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించిన బెంగాల్ కవి శ్రీ బంకించంద్ర చటర్జీ 1875 నవంబర్ 7న తన ఆనంద్ మట్ నవలలో రాసిన వందేమాతరం గీతం నేడు యావత్ భరతావనిని ఉర్రూతలూగిస్తూ భారత దేశ ఐక్యతను, సమగ్రత్తను చాటుతోంది. ఆ మహానుభావుడు రాసిన ఈ గీతం నేడు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, సంస్థలు ఆరంభ గీతంగా వాడుకుంటున్నాయి. ఈ గీతం నేటితో 150 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం భూత్పూర్‌లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో మార్మోగింది. సరిగ్గ ఉదయం 10గంటలకు అన్ని కార్యాలయాలు, విద్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు బహిరంగంగా ఆలపించారు.



వందేమాతరం 150వ వార్షికోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం




వందేమాతరం గీతాలాపన చేస్తున్న దృశ్యం



150వ ఆకారంలో వివేకానంద విద్యాలయం విద్యార్థులు



వందేమాతరం గీతాలాపన చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



భూత్పూర్ జెడ్పి హెచ్ఎస్‌లో ..



భూత్పూర్ రాగూర్ మెమోరియల్ స్కూల్ లో ..

## గ్రామాలలో పర్యటించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు

**గ్రామాలలో పలు దరఖాస్తులపై సమాచార సేకరణ**



సాదా బైనమా దరఖాస్తుపై పొలాన్ని పరిశీలిస్తున్న ట్రైని డిప్యూటీ కలెక్టర్లు

**ఇటిక్యాల నవంబరు 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని షాబాద్. ఉదండాపురం గ్రామాలలో శుక్రవారం జిల్లాకు వచ్చిన ట్రైని డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి. రాజ్ కుమార్ కలసి గ్రామాలలో పర్యటించారు. ఆర్ఐ మదన్ మోహన్.గ్రామాల జిపిఓలతో కలసి షాబాద్ గ్రామంలో ఓ కుటుంబం ఫ్యామిలీ మెంబర్ ధ్రువపత్రం కోసం రెవెన్యూకార్యాలయంలో దరఖాస్తుచేసుకోగా ఆకుటుంబంలోని సభ్యుల సంఖ్య వారి పూర్తి వివరాలను ట్రైనిడిప్యూటీ కలెక్టర్లు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉదండాపురం గ్రామంలో సర్వే నంబర్ 122లో సాదా బైనమాకొరకు దరఖాస్తు చేసుకోగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్ రెడ్డి, రాజ్ కుమార్‌లు ఆ పొలం వద్దకు వెళ్లి రైతులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు. వారి విద్య ప్రమాణాలు.మధ్యాహ్న భోజనం మెనూప్రకారం విద్యార్థులకు వండి పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.అలాగే ఉపాధ్యాయులను కూడా మధ్యాహ్నభోజనం ఇక్కడే చేస్తారా అని అడుగగా మేము కూడా విద్యార్థులతో పాటే మధ్యాహ్నం భోజనం ఇక్కడే చేస్తామని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లకు ఉపాధ్యాయులు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల జిపిఓలు రైతులు పాల్గొన్నారు..

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వండి పెట్టాలి

**ఇటిక్యాల నవంబర్ 7, ప్రభాతవార్త :** ప్రభుత్వ హాస్టల్లో గురుకుల హాస్టల్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వండి పెట్టాలని అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్ఓ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగండి విద్యార్థులకు అందించాలని జిల్లా సామాజిక సంక్షేమ అభివృద్ధి అధికారి ను షిత వల్లూరు హాస్టల్ వార్డెన్ నరేష్ కు సూచించారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో గల ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆమె సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అభివృద్ధి అధికారి నుషిత విద్యార్థులతో మాట్లాడుతూ. వార్డెన్ ప్రతిరోజు విధులకు వస్తున్నారా అలాగే మెనూ ప్రకారం భోజనం వండి పెడుతున్నారా మరియు ఆర్వో ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనం వండే సమయంలో జాగ్రత్తలు తీసుకొని నాణ్యమైన కూరగాయలు. ఆకుకూరలు కొనుగోలు చేసి విద్యార్థులకు భోజనం వండి పెట్టాలని అలాగే విద్యార్థులు ఉండే గదులను కూడా పరిశుభ్రంగా ఉంచాలని. మరుగుదొడ్లు. మూత్రశాలలు మరియు హాస్టల్ పరిధిలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని వార్డెన్ కు అధికారి సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇటిక్యాల ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో వల్లూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఇందులో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసి రోగాలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నరేష్. డాక్టర్ అనిరుద్. పి.హెచ్.ఎన్ సత్యమ్మ. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఆశా కార్యకర్తలు. విద్యార్థులు పాల్గొన్నారు..

## పోగొట్టుకున్న డబ్బును బాధితుడికి తిరిగి ఇచ్చిన ఎస్ఐ బాలచందర్



**గద్వాలటౌన్ నవంబర్7,ప్రభాతవార్త:** పోగొట్టుకున్న డబ్బులు రోడ్డుపై మహిళలకు దొరకగా వాటిని ట్రాఫిక్ ఎస్ఐ బాలచందర్ బాధితునికి అందజేశారు. దయానంద స్కూల్లో పీ.ఈ.టీ.గా విధులు నిర్వహిస్తున్న గంజిపేటకు చెందిన తిమన్న గురువారం ఉదయం పట్టణం లోని ప్రభుత్వ బాలికల పాఠశాల ముందు నడుచుకుంటూ వెళ్తుండగా రోడ్డుపై రూ.10వేలు పడిపోగా, అదే సమయంలో ఆ దారిలో వెళ్తున్న దౌదర్ పల్లిలో నివాసం ఉంటున్న కంట్లో నలుసు తీసే ముగ్గురు మహిళలకు ఆ డబ్బులు కనిపించాయి. వారు ఆ నగదును తమ వద్ద ఉంచుకోకుండా, నిజాయతీగా గద్వాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ కి అప్పగించారు. డబ్బులు పోగొట్టుకున్న సమాచారాన్ని గురువారం సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా బాధితునికి విషయం తెలిసింది. ట్రాఫిక్ పోలీసు కార్యాలయంలో బాధితుడు ఎస్ ఐ ని కలిసి విషయాన్ని తెలియజేశారు. శుక్రవారం డబ్బు పోగొట్టుకున్న తిమ్మాన్నకు ట్రాఫిక్ పోలీస్ కార్యాలయంలో పోగొట్టుకున్న డబ్బును ఎస్ ఐ బాలచందర్ బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు యుగేందర్ పాల్గొన్నారు.




గీతాలాపన చేస్తున్న అధికారులు, ప్రజలు

## దేశభక్తిని. త్యాగస్ఫూర్తిని నింపే వందేమాతరం గీతం

**ఇటిక్యాల నవంబర్7,ప్రభాతవార్త;** వందేమాతరం గీతం భారతీయులలో జాతీయచైతన్యాన్ని దేశభక్తిని త్యాగస్ఫూర్తిని మేల్కొలిపిందని ఇప్పటికిమనకు ఐక్యతభావం గుర్తుచేస్తుందని స్వాతంత్ర ఉద్యమంలో లక్షలాది భారతీయ గుండెల్లో జాతీయ చైతన్యాన్ని వందేమాతరం గీతం నింపిందని డిప్యూటీ తాహసిల్దార్ నందిని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసిల్దార్ నందిని. ఆర్ఐ మనోహర్. కార్యాలయ సిబ్బంది, ప్రజలు కలిసి సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు.

## మాదాసి కురువలకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రం ఇవ్వాలి



**వీపనగండ్ల నవంబర్7,ప్రభాతవార్త;** వెనుకబడినటువంటి మాదాసికురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణపత్రం ఇవ్వాలని మాదాసి మండల అధ్యక్షుడు రాచూరి తిరుపతయ్య పెద్ద ఉషన్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నాడు వారు వీపనగండ్ల తహసిల్దార్‌కు మెమొరండం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాదాసి కురువలు వెనుకబడి ఉన్నారని వారు ఆర్థికంగా ఎదగాలంటే ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వేరే ప్రాంతాలలో మాదరాశి కురువ కులమునకు చెందిన వారికి ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వడం జరిగిందని ఇక్కడ కూడా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఒరే తిరుపతయ్య, సభ్యులు రాచూరి రాజశేఖర్ ,రాచూరి రమేష్, ఆవుల ఉషాన్ పాల్గొన్నారు.



ఇండ్ల మధ్యలో డ్రైనేజీ మురుగు నీరు

## ఏం జరుగుతోంది..?

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రశ్నించి వాక్ అవుట్ చేయడంతో పట్టణంలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఈ క్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి మున్సిపాలిటీకి సంబంధించి నూతన జెసిబిని ప్రారంభించేందుకు కార్యాలయానికి చేరుకోవడం జెసిబినీ ప్రారంభించడంతో మరో చర్చకు దారితీసింది. ఎమ్మెల్యే అనిరుథ్‌రెడ్డి మున్సిపల్ పాలకవర్గంపై ఫోకస్ చేస్తారా..సమస్యలు పరిష్కరించి చక్కబెడతారా వేచి చూడాల్సిందే అంటూ చర్చించుకుంటున్నారు.

## చిత్తడి నేలల సంరక్షణ కీలకం

మొదటి పేజీ తరువాయి భాగం..

ఉంచి భూగర్భ జలాలను పునరుత్పత్తి చేయడంలో, వన్యప్రాణుల నివాస స్థలాలు, చిత్తడి నేలల గుర్తింపు, భౌగోళిక సరిహద్దుల నిర్ణయం,వాటి పరిరక్షణ, అభివృద్ధికి వివిధ శాఖల జిల్లా అధికారులతో మెంబర్ కన్వీనర్‌గా జిల్లా అటవీ శాఖ అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా సాగు నీటి పారుదల అధికారి ని సభ్యులుగా కమిటీ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. చిత్తడి నేలల స్వరూపాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత" అని అన్నారు. వెట్ ల్యాండ్ ప్రాంతాలనుఅభివృద్ధి చేయడంలోచర్యలు తీసుకోవాలని సూచిస్తూ, పర్యావరణ అనుకూల ప్రాజెక్టులను రూపొందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానికసంస్థల అదనపుకలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, డి ఆర్ డి ఓ నరసింహులు, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, మత్స్య శాఖ అధికారిణి రాధా రోహిణి, డీపీఓ నిఖిల, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి ఆర్థిక సాయం

- రూ.25వేలు అందజేసిన ఎరుకల సంఘం నాయకులు



ఇందుకు రూ.25వేల నగదు అందజేస్తున్న సభ్యులు

**మహబూబ్‌నగర్, నవంబరు7, ప్రభాతవార్త:** మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఎస్ చిన్నప్ప కూతురు ఎస్ ఇందు ప్రతిమ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం సీటు సాధించింది. అయితే హాస్టల్ ఫీజు చెల్లించేందుకు ఆర్థిక స్తోమత లేనందున వారి తల్లిదండ్రులు సంఘం దృష్టికి సహాయం కోసం అభ్యర్తించారు. వెంటనే స్పందించి వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకొని సంఘం తరపునరూ.25వేల అందజేశారు. ఈమేరకు మహబూబ్‌నగర్ జిల్లా గిరిజన భవనంలో జిల్లాఎరుకల సంఘం సభ్యులు ఇందును పూలమాల,శాలువాతో ఘనంగా సత్కరిం చి, నగదు ప్రోత్సాహకము అందించారు.కార్యకముములో జిల్లా అధ్యక్షులు K.వెంకట్రాములు, ప్రధానకార్యదర్శి పర్వతాలు,గౌరవాధ్యక్షుడు M.బాలయ్య, రమణయ్య, P.వెంకటస్వామి, R.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## కళా ప్రదర్శనలు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

**నారాయణ పేట, నవంబరు 7 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. డీవైఎస్ఓ వెంకటేష్ అధ్యక్షతన జరిగినఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎంఏ రషీద్ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కళారంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని ఇలాంటి కార్యక్రమాలు వారి సృజనాత్మకతను వెలికితీస్తాయని ఆయన అన్నారు. డీసీపీ భానుప్రకాష్ మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్లు కళా ప్రదర్శనలు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. స్వామి వివేకానందుని ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని దేశ నిర్మాణంలో యువతముందుండాలని వక్త నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొని విద్యార్థులు తమ ప్రతిభనునిరూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నృత్యం, చిత్రలేఖనం, వ్యాస రచన, సైన్స్‌ఫెయిర్ పోటీలు నిర్వహించగా విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్

## అర్హత కలిగిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపు

■ అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్

**వనపర్తి, నవంబరు 7 ప్రభాతవార్త:** జిల్లాలో ఖరీఫ్ 2025,26 సీజన్‌కు సంబంధించి ఇంకా బ్యాంకు గ్యారంటీలు సమర్పించని అర్హత కలిగిన మిల్లర్లు వెంటనే బీజీలు సమర్పిస్తే ధాన్యం కేటాయించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ సూచించారు. శుక్రవారం అదనపు కలెక్టర్‌తన ఛాంబర్లో జిల్లా కలెక్టర్ సూచన మేరకు మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ 2025,26 సీజన్‌కు సంబంధించి అర్హత సాధించిన 80 మిల్లులకు గాను 18 మిల్లులు ఇప్పటికే బ్యాంకు గ్యారంటీలు సమర్పించగా వారికి ధాన్యం కేటాయించడం జరుగుతోందని తెలిపారు. ఇంకా బ్యాంకు గ్యారంటీలు సమర్పించని మిల్లర్లు వేగంగా 10% బీజీలు సమర్పించాలని ఆదేశించారు. మిల్లర్లు బదులిస్తూ రెండు, మూడు రోజుల్లో బ్యాంకు గ్యారంటీలు సమర్పించే విధంగా ప్రయత్నిస్తామని తెలియజేశారు. బ్యాంకు గ్యారంటీల విషయంలో మిల్లర్లకు ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు సహకరిస్తామని లీడ్ బ్యాంకు మేనేజర్ తెలియజేశారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, డిఎం జగన్, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మిల్లర్లు అధికారులు

# జాతిని జాగృతం చేసిన ప్రేరణ గీతం వందేమాతరం

## ఘనంగా వందేమాతరం దినోత్సవం

**బిజినేపలి, నవంబరు7 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరంలో జాతిని జాగృతం చేసిన ప్రేరణ గీతం వందేమాతరం అని తహసిల్దార్ మునిరోద్దీన్ అన్నారు. వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సామూహికంగా వందేమాతర గీతం ఆలపించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పాఠశాలల ఆధ్వర్యంలో వందేమాతర గీతం ఆలపించారు. జాతీయోద్యమ మహనీయులకు నివాళులర్పించారు. వందేమాతరం జాతీయ గీతం స్ఫూర్తిగా, సమైక్యతా భావంతో దేశ అభివృద్ధికి పునరంకితమవుదా మని డిప్యూటీ తహసిల్దార్ చిక్కుడు రవికుమార్ పిలుపునిచ్చారు. ఎస్సై కె. శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ గుర్తింపుభావన,వలస పాలనపై ప్రతిఘటన పెరుగుతున్న ఆ కాలంలో వందేమాతరం మాతృభూమినిబలం, శ్రేయస్సు,దైవత్వానికి ప్రతీకగా మార్చింది అన్నారు. వందేమాతరం స్వాతంత్ర్య పోరాటంలో చారిత్రకపాత్ర పోషించిందని ప్రకటిస్తూ, జాతీయగీతం జనగణమనతో సమానంగా వందేమాతరానికి గౌరవం ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నారాయణ పేట, నవంబరు7 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలోని వీర సావర్కర్ చౌరస్తాలో భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఘనంగా సామూహిక గీతాలాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చినా అంతకుముందే వందేమాతర గేయం 1875లో బంకిం ఛంద్ర ఛటర్జీ రచించినదని తెలిపారు. ఈ గేయం ఆయన రాసిన ఆనందమఠ్ నవలలో ప్రచురితమై స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందన్నారు.బంకించంద్ర ఛటర్జీ బెంగాలీ రచయిత ప్రభుత్వ అధికారి కాగా ఈ గేయం మొదట సంస్కృతంలో రచించబడిందని వివరించారు. భారత జాతీయ గీతంతో సమానమైన హోదా కలిగిన వందేమాతరం దేశభక్తి ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని అన్నారు. ప్రతి భారత పౌరుడు దేశ అభ్యున్నతికి రక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత ఉందని మణిశంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్, జేఏసీ నాయకులు వెంకటయ్య, మదన్, సాయిబన్న, యువమోర్చా నాయకులు పళ్ళ రఘు, చేతన్ డీలర్ మణి, బాలకృష్ణ, నవీన్, అరవింద్, అంజి, త్రిశాంక్, రవి, మీస్కిన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అక్కడున్న దుకాణదారులు, పాదచారులు వాహనదారులు, ప్రజానీకం కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

**ఊట్కూర్, నవంబరు7 ప్రభాతవార్త:** భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఆత్మగా నిలిచిన వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తి కావడంతో ఊట్కూర్ మండల పరిధిలోని వల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో విశేషంగా కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రాంగణం దేశభక్తి నినాదాలతోమార్మోగింది. విద్యార్థులు తెల్ల దుస్తులు ధరించి త్రివర్ణపతాకాలు పట్టుకుని వందేమాతరం" అంటూ సామూహిక గానంతో దేశమాతనుస్మరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ -బంకిమ్ చంద్ర చట్టర్జీ రచించిన వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య యుగంలో దేశప్రేమకు చిహ్నంగా నిలిచిందని, ప్రతి విద్యార్థి హృదయంలో ఈగీతం జ్వాలగా ఉండాలని తెలిపారు.ఉపాధ్యాయులు దేశభక్తి ప్రేరణతో కూడిన పాటలు, ప్రసంగాలు చేశారు. చిన్నారులు దేశ జెండాకు వందనంసమర్పించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు,తల్లిదండ్రులు పాల్గొనివిద్యార్థులకు అభినందనలు తెలిపారు.



బిజినేపల్లి పోలీసుల వందేమాతర గీతాలాపన చేస్తున్న దృశ్యం



కారుకొండ పాఠశాలలో వందేమాతర గీతాలాపనలో విద్యార్థులు

**వెల్దండ, నవంబర్ 7 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వందేమాతరం జాతీయగీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ, భారతమాత, డాక్టర్‌బి.ఆర్ అంబేద్కర్‌చిత్రపటాలకు తహసిల్దార్ కార్తీక్‌కుమార్ ఆధ్వర్యంలోపూలమాలలు వేసినివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వందేమాతరం జాతీయగీతాన్ని 1875 సెప్టెంబర్ 7న బెంగాల్ కవి బంకించంద్ర చటర్జీ రచించిన 150 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో డీటీ కిరణ్‌కుమార్, నారాయణ, పుల్లయ్య, మల్లయ్య, ఆనంద్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



సామూహిక గీతాలాపన చేస్తున్న దృశ్యం



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



వందేమాతరం గీతాలపాన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది

## సమన్వయంతో పనిచేయకపోతే చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

పథకాలను అమలు చేయడమే కాకుండా,వాటిని సంబంధిత పోర్టల్స్ లో అప్డేట్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడం కూడా విద్యాశాఖ అధికారుల బాధ్యత అని గుర్తు చేశారు. జిల్లాలో అమలు చేస్తున్న పలు పథకాలు యూడైస్ పోర్టల్‌లో డేటాఎంట్రీ చేయని కారణంగా రాష్ట్రం లో జిల్లా వెనుకబడుతోందని తప్పనిసరిగా ఎంఐఎస్ ఆపరేటర్ల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను డేటా ఎంట్రీ చేయించాలని ఆదేశించారు. జిల్లా విద్యా శాఖ పరిధిలో విధులు నిర్వర్తించే పై స్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు సమన్వయంతో పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.మండల విద్యాధికారి నుంచి ఆపరేటర్ వరకు సమన్వయం చేసుకొని జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాల గణాం కాలను అప్డేట్ చేయాలన్నారు. జిల్లాలో ఇంటర్నెట్ కనెక్షన్ లేని పాఠశాలలకు వెంటనే ఇంటర్నెట్ కనెక్టివిటీ చేయించి సంబంధిత పోర్టల్‌లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. రాబోయే పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు.అదేవిధంగా మధ్యాహ్న భోజనానికి సంబంధించి గ్యాస్ సిలిండర్ ద్వారానే వంట చేయాలని, ఇందుకోసం అన్ని పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ కనెక్షన్ కలెక్టర్ నిధుల నుంచి ఇప్పించడం జరుగుతుందని తదుపరి సిలిండర్లను కొనసాగించేవిధంగా హెడ్మాస్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులకు హెల్త్ చెకప్ చేయించడం జరిగిందని పది రోజుల్లో ఆ డేటాను కూడా పోర్టల్‌లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో టాయిలెట్స్ లేని పాఠశాలలకు సంబంధించి తప్పుగా డేటాఎంట్రీ నమోదుచేశారని, కొన్ని పాఠశాలల్లో టాయిలెట్స్ ఉన్నప్పటికిని లేనట్లుగా నమోదు చేశారని, అలాంటి వాటిని తిరిగి డేటా సరి చేయాల న్నారు. ఇక పీఎం శ్రీకింద జిల్లాలోని పలు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంజూ రైన 15 పనులను త్వరగా చేయించేవిధంగాచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఈఓఅబ్దుల్ ఘని, ఎంఈఓలు, హెడ్మాస్టర్లు, ఏంఐఎస్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## జాతీయ గేయానికి 150 ఏళ్లు...

### వందేమాతరం గీతాన్ని ఆలపించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు

### విధులను నిర్లక్ష్యం చేసిన 11 మందికి నోటీసులు

**దేవరకద్ర, నవంబరు 7 ప్రభాతవార్త:** భారత జాతీయ గేయమైన వందేమాతరంను రచించి 2025 నవంబర్ 7 నాటికి 150 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. శుక్రవారం దేవరకద్ర మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయంలో ఉదయం 10 గంటలకు 150వ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. శుక్రవారం దేవరకద్ర తహసిల్దార్‌కార్యాలయంలో తహసిల్దార్, సిబ్బంది, కలిసి జాతీయ గీతాన్నిఆలపించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ దీపిక మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో ఈ గేయం ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చి, సామాన్యులను సమరయోధులుగా మార్చింది. భారత దేశ కీర్తిని చాటిన రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన వందేమాతర గీతాన్నిప్రభుత్వ శాఖలఅధికారులు, పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎక్కడికక్కడే కలిసి జాతీయ గీతాన్ని ఆలపించడం ఎంతో సంతోషంగా ఉందని దీపిక రెడ్డి అన్నారు.ఈ గీతాన్ని దేవరకద్ర మండలంలోని వివిధ పాఠశాలలు, మైనార్టీ గురుకుల పాఠశాల,పోలీస్ స్టేషన్, ప్రజా పరిషత్ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయలలో వివిధ శాఖల అధికారులు, రైతులు, స్వచ్ఛంద సేవకులు, యువకులు, ఆలపించి భారతదేశ ఔన్నత్యాన్నిచాటారన్నారు.తదనంతరం తహసిల్దార్ కార్యాలయంలో విధులపట్ల 11మంది సిబ్బంది నిర్లక్ష్యం చేశారని తహసిల్దార్ దీపికరెడ్డి తమ సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని తహసిల్దార్ అన్నారు.



దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్‌లో:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో వందేమాతరంను రచించి 150 సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా కార్యాలయంలో సిబ్బంది అందరూ సామూహికంగా వందేమాతరం పాడటం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల తహసిల్దార్ రాజు, ఆర్ఐ రాధాకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

**భూత్పూర్‌లో:** భారతస్వతంత్రోద్య మంలో కీలక పాత్ర పోషించిన బెంగాల్ కవి శ్రీ బంకించంద్ర చటర్జి 1875 నవంబర్ 7న తన ఆనంద్ మట్ నవలలో రాసిన వందేమాతరం గీతం నేడు యావత్ భరతావనిని ఉర్రూతలూగిస్తూ భారత దేశ ఐక్యతను, సమగ్రత్తను చాటుతోంది. ఆ మహనుభావు డు రాసిన ఈ గీతం నేడు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా లయాలు, సంస్థలు ఆరంభ గీతంగా వాడుకుంటున్నాయి. ఈ గీతం నేటితో 150 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం భూత్పూర్‌లోని అన్ని ప్రభు త్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో మార్మోగింది. సరిగ్గ ఉదయం 10గంటలకు అన్ని కార్యాలయాలు, విద్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు బహిరంగంగా ఆలపించారు.



## బస్సు షెల్టర్ లేక అవస్థలు

**దేవరకద్ర, నవంబరు 7 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం రహదారిపై, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. అటు హైదరాబాద్,ఇటునారాయణపేట, కర్ణాటక,సరిహద్దు ప్రాంతాలసరి హద్దు మండలం కావడం వల్ల వందలాది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధి వద్ద ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్ లేకపోవడంతో వృద్ధులు, చిన్నపిల్లలు రోడ్డు పైనే కూర్చుంటున్నారు. బస్సు కోసం వేచి చూసే క్రమం ప్రమాదం జరిగి ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, ప్రయాణి కుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ నిర్మించాలనిపలువురు కోరుతున్నారు.



బస్సు షెల్టర్ లేక రోడ్డుపై బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

# మోడల్ హాస్టల్‌గా మారుస్తాం

- ■ ఆధునిక లైబ్రరీ అత్యుత్తమ పుస్తకాలు అందుబాటులోకి తెస్తాం
- ■ వెంటనే నివేదికలు తయారు చేయండి
- ■ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదేశం
- ■ కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాల తనిఖీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు7, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి వారి వసతి, ఆహారం, విద్యా సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ ప్రాంగణంలో పార్క్, చిల్డ్రన్ ప్లేయింగ్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేయాలని, బీసీ వసతి గృహం పై అంతస్తులో కొత్త హాల్ నిర్మాణం కోసం అంచనా నివేదికలు వెంటనే సిద్ధం చేయాలని,ముడా ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆయన ఆదేశించారు. ఎస్సీ వసతి గృహ ప్రాంగణంలో సీసీ బెడ్ వేయాలని, వసతి గృహ పరిసరాలను శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఆటవిడుపు, భద్రత,ఆరోగ్యకర వాతావరణం కల్పించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఆయన చెప్పారు. హాస్టల్ విద్యార్థినులకు త్వరలోనే ఆధునిక లైబ్రరీ ఏర్పాటు చేసి విద్యార్థులకు అత్యుత్తమ పుస్తకాలుఅందుబాటులోకి తీసుకు వస్తామని ఎమ్మెల్యే గారు తెలిపారు."నియోజకవర్గం లోని ప్రతి వసతి గృహాన్ని మోడల్ హాస్టల్‌గా అభివృద్ధికి చర్యలు తీసుకుంటా మని" ఆయన స్పష్టం చేశారు. తరువాత ప్రభుత్వ పోలీసు లైన్ పాఠశాలలో జరుగుతున్న శతశాతం కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. శతశాతం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ మంచిఫలితాలు సాధించాలని ఆయనసూచించారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ పాల్గొన్నారు.



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి